సాక్షి ఖమ్మం
శనివారం, 25, జనవరి, 2025



రా రమ్మని... రారా రమ్మని!
ఉమ్మడి జిల్లాలోని సందర్శనీయ స్థలాల వివరాలతో జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా కథనం..
10లో




సత్తా చాటిన జిల్లా బాలికలు
రాష్ట్రస్థాయి అండర్‌-17 బాలికల క్రికెట్‌ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు సత్తా చాటి ట్రోఫీ కైవసం చేసుకుంది.
10లో

గరిష్టం / కనిష్టం
32°/ 16°

వాతావరణం
జిల్లాలో శనివారం ఉదయం, రాత్రి చలిగాలుల తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

రిజర్వేషన్‌.. టెన్షన్‌



జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో యంత్రాంగం నిమగ్నమైంది. ఎప్పుడు నోటిఫికేషన్‌ వచ్చినా నిర్వహించేలా ఓటర్ల జాబితా సిద్ధం చేయగా.. పోలింగ్‌ కేంద్రాలను కూడా ఎంపిక చేశారు. గ్రామపంచాయతీలకు పాలకవర్గాలు లేక ఏడాది కావొస్తుండగా అటు ఎన్నికల సంఘం, ఇటు ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యాన రిజర్వేషన్లు తేలకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. అసలైతే గత ఎన్నికల రిజర్వేషన్లనే ఈసారీ అనుసరించాల్సి ఉంది. కానీ కాంగ్రెస్‌ ప్రభుత్వం పంచాయతీ రాజ్‌ చట్టాన్ని సవరించడంతో మార్పులు జరగనున్నాయి. దీంతో ఆశావహులు తమకు అవకాశం దక్కుతుందా.. లేదా అన్న మీమాంసతో సతమతమవుతున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఎలా ముందుకు పోదాం..

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్న ఆశావహులకు రిజర్వేషన్ల టెన్షన్‌ పట్టుకుంది. బరిలో నిలవాలనుకునే వారిలో కొందరు గ్రామస్తులను కలవడం, తమకు మద్దతు ఇవ్వాలని కోరడంతో పాటు సంక్రాంతి సందర్భంగా ముగ్గులు, ఇతర పోటీలను నిర్వహించారు. మరోవైపు అనుచరులతో సమావేశమవుతూ రిజర్వేషన్లు, పోటీపై సమాలోచనలు చేస్తున్నారు. తమకు అనుకూలంగా రిజర్వేషన్‌ వస్తే ఏం చేయాలి.. లేకపోతే కుటుంబీకులా, సన్నిహితులా ఎవరిని బరిలో దింపాలి.. ఇవేవీ కుదరకపోతే ఎవరికి మద్దతు ఇవ్వాలనే అంశంపై అంచనాకు వస్తున్నారు. ఏదిఏమైనా రిజర్వేషన్ల ప్రకటన వెలువడితే పోటీ చేసేందుకు సిద్ధం కావాలని నేతల ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది.

గ్రామపంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా యంత్రాంగం

- ఇప్పటికే ఓటర్ల జాబితా, పోలింగ్‌ కేంద్రాలు ఫైనల్‌
- రిజర్వేషన్లపై ఆశావహుల్లో ఉత్కంఠ

ప్రత్యేకాధికారుల పాలన

జిల్లాలో మొత్తం 589 గ్రామపంచాయతీలు ఉండగా.. 2019లో ఎన్నికలు జరిగాయి. ఆ ఏడాది ఫిబ్రవరి 2న పాలక వర్గాలు పగ్గాలు చేపట్టాయి. గత ఏడాది ఫిబ్రవరి 1న పదవీ కాలం ముగిశాక ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. ఈనేపథ్యాన పర్యవేక్షణ లేక ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇతర పనుల ఒత్తిడితో గ్రామాలపై దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. దీంతో సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు.

ఎన్నికలకు అంతా సిద్ధం

జీపీ ఎన్నికల నోటిఫికేషన్‌ ఎప్పుడు జారీ అయినా పకడ్బందీగా నిర్వహించేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే ఎన్నికల సామగ్రి చేరగా, గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధమైంది. మొత్తం ఓటర్లు 8,64,702 మందిగా తేల్చిన అధికారులు ఇందులో మహిళలు 4,46,527 మంది, పురుషులు 4,18,151 మంది, ఇతరులు 24 మంది ఉన్నారని జాబితాలు విడుదల చేశారు. అలాగే, 5,438 పోలింగ్‌ కేంద్రాలను ఎంపిక చేసి మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేలా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే 3,148 బ్యాలెట్‌ బాక్స్‌లను సమకూర్చుకోగా గుర్తులు కూడా సిద్ధమవడంతో బ్యాలెట్‌ పేపర్ల ముద్రణ కూడా పూర్తికావొచ్చింది. ఈనేపథ్యాన ఓటర్ల జాబితా ఆధారంగా ఆశావహులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

తేలని రిజర్వేషన్ల వ్యవహారం

గ్రామపంచాయతీ ఎన్నికలకు అధికారికంగా ఏర్పాట్లు జరుగుతున్నా రిజర్వేషన్లు మాత్రం ఇంకా తేలలేదు. 2019 ఎన్నికల సందర్భంగా అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం 2018 గ్రామపంచాయతీ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం రూపొందించిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగాలి. కానీ కాంగ్రెస్‌ ప్రభుత్వం పంచాయతీ రాజ్‌ చట్టాన్ని సవరించడంతో రిజర్వేషన్లు మారనున్నాయి. రిజర్వేషన్ల దామాషా ఖరారుపై బీసీ కమిషన్‌ కసరత్తు చేస్తుండగా. చట్టసభలో బిల్లు ఆమోదం పొందడంతో రిజర్వేషన్ల మార్పు అనివార్యం కానుంది.

గత ఎన్నికల్లో 584 జీపీల రిజర్వేషన్ల వివరాలు

షెడ్యూల్‌ ఏరియా జీపీలు	99
ఎస్టీ మహిళ	50
ఎస్టీ జనరల్‌	49
నూరు శాతం ఎస్టీ జీపీలు	11
ఎస్టీ మహిళ	06
ఎస్టీ జనరల్‌	05
నాన్‌ షెడ్యూల్‌ ఏరియా జీపీలు	237
ఎస్టీ మహిళ	29
ఎస్టీ జనరల్‌	30
ఎస్సీ మహిళ	60
ఎస్సీ జనరల్‌	60
బీసీ మహిళ	29
బీసీ జనరల్‌	29
అన్‌ రిజర్వ్‌డ్‌ జీపీలు	237
మహిళలు	118
జనరల్‌	119

తలరాతలు మార్చేది ఓటే...

- 18ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కుకు అర్హులే
- జిల్లాలో ఓటర్లు.. 12లక్షల మందికి పైగానే

నేడు జాతీయ ఓటరు దినోత్సవం

ఖమ్మంసహకారనగర్‌: ఓటర్లు ఆలోచనతో తీసుకునే నిర్ణయం ఐదేళ్ల సుపరిపాలనకు బాటలు వేస్తుంది. అలాకాకుండా అనాలోచితంగా ముందుకు సాగితే అనేక కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రజాస్వామ్యంలో కీలకమైన ఓటర్లకు బాధ్యతలు గుర్తుచేయడం.. ఓటు హక్కు ఆవశ్యకతను వివరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏటా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఈనేపథ్యాన నేడు(శనివారం) ఓటరు దినోత్సవం సందర్భంగా కథనం.

ఓటరు దినోత్సవం ఇలా...

ఎన్నికల ప్రక్రియలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచడంలో భాగంగా ఎన్నికల కమిషన్‌ ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 2011 నుంచి ఇది మొదలుకాగా ఓటు హక్కు వినియోగంపై విస్తృతంగా ప్రచారం చేస్తూ అర్హులైన వారంతా ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక కొత్త ఓటర్ల చేర్పు, జాబితాలో సవరణలు, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ నిరంతరం చేపడుతున్నారు.

కీలకంగా యువత ఓటర్లు

జిల్లాలోని ఓటర్లలో యువతే అత్యధికంగా ఉన్నారు. 18నుంచి 19ఏళ్ల వయస్సు ఓటర్లు 24,297మంది, 20–29 ఏళ్ల వారు 2,43,295మంది, 30–39 ఏళ్ల ఓటర్లు 3,21,428మంది ఉన్నారని ఓటర్ల జాబితా తెలియచేస్తోంది. అలాగే, 40–49 ఏళ్ల ఓటర్లు 2,51,720మంది, 50–59 ఏళ్ల మధ్య 1,94,061మంది, 60–69మధ్య 1,16,242మంది, 70–79మధ్య 58,817మంది, 80–89 ఏళ్ల 17,193 మంది ఓటర్లు ఉన్నారు. కాగా, 90నుంచి 99మధ్య 3,274మంది, 100నుంచి 109మధ్య ఓటర్లు 245 మంది ఉండగా.. ఆపై వయస్సు కలిగిన ఓటర్లు సైతం ఇద్దరు ఉండడం విశేషం. వీరిద్దరు ఖమ్మం, వైరా నియోజకవర్గాల్లో ఉన్నారు.

ఏటా నాలుగు సార్లు అవకాశం

ఓటరు నమోదు చేసుకునేందుకు ఏటా నాలుగు సార్లు అవకాశం కల్పిస్తున్నారు. జనవరి, ఏప్రిల్‌, జూలై, అక్టోబర్‌ 1వ తేదీకి 18ఏళ్లు నిండిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి ఓటరుగా నమోదు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు యువత ఓటర్లుగా నమోదు చేసుకునేలా విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.



రంగవల్లుల పోటీలు

జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం సందర్భంగా పలు ప్రాంతాల్లో రంగవల్లుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించే ఈ సమావేశంలో సీనియర్‌ ఓటర్లను సన్మానించడమే కాక కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేయనున్నారు. అలాగే, ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తారు.

జిల్లాలో 'ఆమే' అధికం

జిల్లాలో ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలతో పాటు ఒక మండలం మినహా వైరా నియోజకవర్గం ఉంది. ఇక ఖమ్మం, మహబూబాబాద్‌ పార్లమెంట్‌ నియోజకవర్గాల పరిధిలో జిల్లా కొనసాగుతోంది. జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య 12,30,572 కాగా.. ఇందులో పురుషులు 5,92,800, మహిళలు 6,37,684, ఇతరులు 88మంది ఉన్నారు. అత్యధికంగా ఖమ్మం నియోజకవర్గంలో 3,24,234 మంది, అత్యల్పంగా వైరా నియోజకవర్గంలో 1,94,540మంది ఓటర్లు ఉన్నారు. మొత్తంగా పురుషుల కంటే మహిళా ఓటర్లు 44,884మంది ఎక్కువ కావడంతో ఏ ఎన్నికల్లో చూసినా గెలుపోటముల్లో కీలకంగా నిలుస్తున్నారు.

ఎంతో ఆనందంగా ఉంది



ఇటీవల దరఖాస్తు చేసుకోగా ఓటు హక్కు కల్పించినట్లు జాబితాలో పేరు పొందుపరిచారు. ఈ విషయం తెలిసి ఎంతో సంతోషంగా అనిపించింది. ప్రజాస్వామ్యంలో మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు హక్కు ఆయుధంగా నిలుస్తుందని నమ్ముతున్నా.

– బంటు అరుణ, కొణిజర్ల

తప్పకుండా ఓటు వేస్తున్నా



నాకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ప్రతీ ఎన్నికల్లో ఓటు వేస్తున్నా. మంచి వాళ్లను ఎన్నుకోవాలంటే ఓటు వేయాల్సిందేనని మా పెద్దలు చెప్పేవాళ్లు. ఓటు ఉన్నా వేయకపోతే వాళ్లు చనిపోయినట్లేనని చెప్పడంతో ఏ ఎన్నిక కూడా వదలకుండా ఓటు వేస్తున్నా.

– రేగు ఎట్టమ్మ, 93సంవత్సరాలు, ఖమ్మం

ఐదు నియోజకవర్గాల్లో ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం	1,55,326	1,68,859	49	3,24,234
పాలేరు	1,16,655	1,26,225	08	2,42,888
మధిర	1,07,550	1,15,805	10	2,23,365
వైరా	94,196	1,00,340	04	1,48,540
సత్తుపల్లి	1,19,073	1,26,455	17	2,45,545
మొత్తం	5,92,800	6,37,684,	88	12,30,572



నేడు జిల్లాకు ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు

ఖమ్మం లీగల్‌: తెలంగాణ హైకోర్టుకు చెందిన ముగ్గురు న్యాయమూర్తులు శనివారం ఖమ్మం రానున్నారు. ఖమ్మం పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్‌ పి.శ్రీసుధతో పాటు జస్టిస్‌ భీమపాక నగేష్‌, జస్టిస్‌ కాజా శరత్‌ ఉదయం ఇక్కడకు చేరుకుంటారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో రెండో అదనపు సీనియర్‌ సివిల్‌ జడ్జి కోర్ట్‌, అసిస్టెంట్‌ సెషన్స్‌ కోర్టులను వారు ప్రారంభిస్తారు. ఈమేరకు ఏర్పాట్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు.

రెండు కళ్లలా అభివృద్ధి, నాణ్యత

- సకాలంలో పూర్తిచేయడమూ ముఖ్యమే
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన మేయర్‌ నీరజ, కమిషనర్‌ అభిషేక్‌ తదితరులు

ఖమ్మంఅర్బన్‌: అభివృద్ధి చేయడం ఎంత ముఖ్యమో నాణ్యత పాటించడమూ అంతే ప్రధానమని.. ఇవి పాటిస్తూనే సకాలంలో పూర్తిచేయడంపైనా దృష్టి సారించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం 8వ డివిజన్‌ బాలపేటలో బల్లేపల్లి నుండి రఘునాథపాలెం బైపాస్‌ వరకు రూ.3.95కోట్లతో చేపట్టే రోడ్డు విస్తరణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మట్లాడారు. ప్రజలకు అవసరమైన వసతులు కల్పించేందుకు చేపడుతున్న పనులకు అందరూ సహకరించాలని సూచించారు. రాబోయే ఆరు నెలల్లో ఖమ్మం నియోజకవర్గం రూపురేఖలు మారాయనే మంచి పేరు రావడానికి అందరూ చేయూతనివ్వాలని తెలిపారు. రోడ్డు విస్తరణ పనుల్లో నివాసాలు కోల్పోయే పేదలకు స్థలం ఇవ్వడమే కాక ఇంటి నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. నగరంలో రూ.249 కోట్లతో చేపడుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను వేసవి లోపు పూర్తి చేయాలన్నారు. అలాగే, సర్దార్‌ పటేల్‌ స్టేడియంలో వసతుల కల్పనకు రూ.8కోట్ల విలువైన పనులు చేపట్టనున్నామని చెప్పారు. రఘునాథపాలెం మండలంలోని 30 చెరువులకు ఉగాది కల్లా మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా నీరు నింపే బాధత తనదని మంత్రి వెల్లడించారు. అనంతరం కేఎంసీ కమిషనర్‌ అభిషేక్‌ అగస్త్య మాట్లాడుతూ విలీన గ్రామాల్లో ప్రత్యేక దృష్టితో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామసభల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా విచారణ చేపట్టి అర్హులకు పథకాలు వర్తింపచేస్తామని చెప్పారు. ఖమ్మం సరిహద్దుల్లో ఏడు చోట్ల స్వాగత బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌ రాయల నాగేశ్వరరావు, మేయర్‌ పునుకొల్లు నీరజ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, ఆర్డీవో నర్సింహారావు, మార్కెట్‌ చైర్మన్‌ హన్మంతరావు, కార్పొరేటర్లు లకావత్‌ సైదులు, కమర్తపు మురళి, అధికారులు రంజిత్‌, యుగంధర్‌తో పాటు మానుకొండ రాధాకిషోర్‌, పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌, బాషా, భాస్కర్‌రావు, గొడుగు నాగేశ్వరరావు, నల్లమల వెంకటేశ్వరరావు, మల్లీడు మనీష్‌, కుర్రా ప్రభాకర్‌, మందడపు రాధాకిషోర్‌ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్‌

ఎంపిక చేసిన గ్రామాల్లో 'సోలార్‌' సర్వే



అధికారులతో సమీక్షిస్తున్న సీఈ తిరుమలరావు

నేలకొండపల్లి: గృహావసరాలతో పాటు వ్యవసాయ మోటార్ల వినియోగానికి సోలార్‌ విద్యుత్‌ ప్లాంట్ల ఏర్పాటు కోసం ఎన్పీడీసీఎల్‌ పరిధిలో 42గ్రామాలను పైలట్‌గా ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు సీఈ కె.తిరుమలరావు తెలిపారు. ఈమేరకు గ్రామాల్లో సర్వే జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలో శుక్రవారం చేపట్టిన ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. తొలిదశగా ఎంపిక చేసిన గ్రామాల్లో వంద శాతం గృహాలు, కార్యాలయాలు, వ్యవసాయ మోటార్లకు ఉచితంగా సోలార్‌ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ గ్రామాలతో పాటు బోనకల్‌ మండలం(22 గ్రామాలు) మొత్తంలో ప్రాజెక్టు అమలుచేయనున్నట్లు వెల్లడించారు. ఆయా ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ వినియోగించుకున్నాక మిగిలిన దాన్ని గ్రిడ్‌కు అనుసంధానించి ప్రతీ యూనిట్‌కు రూ.5ను చెల్లించనుండగా యజమానులకు ఆదాయం కూడా లభిస్తుందని సీఈ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఈ సురేందర్‌, అధికారులు చింతమళ్ల నాగేశ్వరరావు, కోక్యానాయక్‌, కె.రామారావు పాల్గొన్నారు.

ఎస్సెస్సీలో ఉత్తమ ఫలితాలే లక్ష్యం



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న శ్రీజ

ఏన్కూరు: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా సిద్ధం కావాలని అదనపు కలెక్టర్‌ డాక్టర్‌ పి.శ్రీజ సూచించారు. ఏన్కూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాక ఎస్సెస్సీ విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు సిద్ధమవుతున్న తీరుపై ఆరాతీశాక బాల్య వివాహాలు, మాదకద్రవ్యాలతో నష్టాలను వివరించారు. ప్రభుత్వ వైద్యాధికారులు మౌనిక, లాస్య, ప్రధానోపాధ్యాయుడు కె.సైదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



పూరి గుడిసె వద్ద పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

బోనకల్‌: ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులందరికీ లబ్ధి జరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ఆశాలత తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల, బోనకల్‌ గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆమె జాబితాలో పేర్లు ఉన్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అలాగే, అర్హత ఉండి ఇల్లు మంజూరు కాలేదని మళ్లీ దరఖాస్తు చేసుకున్న వారిని కూడా కలిసి డేటా ఎంట్రీలో ఏమైనా పొరపాట్లు జరిగియా అని ఆరా తీశారు. ఎవరు కూడా ఆందోళనకు గురికావొద్దని, అర్హులందరికీ ఇళ్లు మంజూరవుతాయని డీపీఓ తెలిపారు. అనంతరం ముష్టికుంట్ల బీసీ కాలనీలో భగీరథ పైప్‌లైన్‌లోకి మురుగునీరు చేరుతోందని స్థానికులు ఫిర్యాదు చేయగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఎంపీఓ శాస్త్రి, ,కార్యదర్శి అశోక్‌ను ఆదేశించారు.

మున్నేరు రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణంలో వేగం

- అన్ని శాఖల సమన్వయంతో భూసేకరణ
- పనులను పరిశీలించిన కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌



రిటైనింగ్‌ వాల్స్‌ పనులపై సూచనలు చేస్తున్న కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌

ఖమ్మంఅర్బన్‌: ఖమ్మం అర్బన్‌, రూరల్‌ మండలాలను మున్నేటి ముంపు నుంచి రక్షించేందుకు ఇరువైపులా నిర్మిస్తున్న రిటైనింగ్‌ వాల్స్‌ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ ఆదేశించారు. అంతేకాక అవసరమైన భూసేకరణను సంబంధిత శాఖలు సమన్వయంతో పూర్తిచేయాలని సూచించారు. రిటైనింగ్‌ వాల్స్‌ పనులను శుక్రవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. రోజువారీ లక్ష్యాలను ఎంచుకుని ప్రణాళికాయుతంగా పనులు జరిగేలా పర్యవేక్షించాలని, వర్షాకాలం వచ్చేలోగా పూర్తయ్యేలా అవసరమైతే అదనపు బృందాలను సమకూర్చుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో 3.50 లక్షల క్యూసెక్కుల మేర వరద వచ్చినా ముప్పు లేకుండా డిజైన్‌ రూపొందించినందున దానికి అనుగుణంగా పనులు జరగాలన్నారు. కాగా, రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణంతో లాభాలను వివరిస్తూ రైతులు, ఇతరుల నుంచి భూములు సేకరించాలని కలెక్టర్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య, తహసీల్దార్‌ రవికుమార్‌, ఉద్యోగులు వహీద్‌, ఉదయ్‌ప్రతాప్‌, మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు గొప్ప లక్ష్యాలను ఎంచుకోవాలి..

ఖమ్మంసహకారనగర్‌: విద్యార్థి దశలోనే బాలికలు గొప్ప లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలని కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌ సూచించారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో శుక్రవారం బేటీ పడావో – బేటీ బచావో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కొణిజర్ల మండలం తనికెళ్ల ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ జూనియర్‌ కళాశాల విద్యార్థినులు కలెక్టర్‌ చాంబర్‌ చూడాలని రాగా వారితో మాట్లాడారు. ఇక్కడ కలెక్టర్లుగా పనిచేసిన అధికారుల వివరాలు, వారు ఏయే స్థానాలకు ఎదిగారో వివరించారు. ఇక్కడ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సుబ్బారావు ఆర్‌బీఐ గవర్నర్‌గా సేవలందించారని తెలిపారు. ప్రస్తుతం బాలికలకు అన్ని అవకాశాలు లభిస్తున్నందున ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఉద్యోగులు ఎస్‌.అరుణ, కె.శ్రీనివాసరావు, ఎస్‌.డీ.సమ్రీన్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫిర్యాదుల స్వీకరణకు క్యూఆర్ కోడ్

కేఎంసీలో వినూత్న ప్రయోగం



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు అధికారులు వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రతీ అంశానికి కార్యాలయానికి వెళ్లడం లేదంటే డివిజన్ ఉద్యోగుల నంబర్ తెలుసుకుని ఫోన్ చేయడంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య నేతృత్వాన క్యూఆర్ కోడ్ రూపొందించారు. ఈ క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ పి.నీరజ శుక్రవారం విడుదల చేయగా వివరాలను కమిషనర్ వెల్లడించారు. ఫిర్యాదుల స్వీకరణను సులభం చేసేందుకు క్యూఆర్ కోడ్ రూపొందించామని తెలిపారు. దీన్ని స్కాన్ చేయడం ద్వారా ఆసరా పింఛన్లు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల సమస్యలే కాక ఇంజనీరింగ్, రెవెన్యూ, పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు చేయొచ్చని వెల్లడించారు. అంతేకాక 83338 33696 నంబర్‌కైనా ఫోన్ చేయొచ్చని తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను కేఎంసీ పరిధిలోని వేయి ప్రాంతాల్లో ప్రజలకు కనిపించేలా అంటించనున్నట్లు కమిషనర్ వివరించారు.

సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి

ఆర్టీసీ ఈడీ ఖుష్రోషా ఖాన్



అవార్డులు అందుకున్న ఉద్యోగులతో ఈడీ ఖుష్రోషా ఖాన్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు ఇతర సిబ్బంది సమష్టి కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని కరీంనగర్ జోన్ ఈడీ ఖుష్రోషా ఖాన్ తెలిపారు. ఖమ్మం డిపో, కొత్త, పాత బస్టాండ్లతో ఆర్ఎం కార్యాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం రీజినల్ స్థాయిలో ఎంపికైన ఉద్యోగులకు ప్రగతిచక్రం అవార్డులు అందజేయడంతో పాటు డ్రైవర్లను సత్కరించారు. అనంతరం ఈడీ మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే అతిపెద్ద ప్రజారవాణా సంస్థ ఆర్టీసీ అని తెలిపారు. ఇటీవల సంక్రాంతి సెలవుల్లో రద్దీ ఉన్నా ఎక్కడా ఇక్కట్లు ఎదురుకాకపోవడంతో ఉద్యోగుల సమష్టి కృషికి నిదర్శమన్నారు. ఆతర్వాత ఉత్తమ డిపోగా ఎంపికైన సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, ఉత్తమ బస్టాండ్‌గా ఎంపికైన కల్లూరు కంట్రోలర్‌ను సత్కరించారు. కాగా, ఏడు డిపోల పరిధిలో 18మంది డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, ముగ్గురు మెకానిక్‌లు ప్రగతిచక్ర అవార్డులకు ఎంపికయ్యారని ఆర్ఎం సరిరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు ఎస్.భవానీప్రసాద్, జీఎన్.పవిత్ర, ఖమ్మం డిపో మేనేజర్ దినేష్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఖమ్మంరూరల్: రూరల్ మండలం పెదతండాలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో నియామకాలకు గత నెలలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తుల ఆధారంగా రూపొందించిన మెరిట్ జాబితాను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపర్చామని ప్రిన్సిపాల్ రత్న ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో అభ్యంతరాలు ఉంటే ఈనెల 25నుండి 28లోపు తగిన పత్రాలతో సమర్పించాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


కూసుమంచి: ప్రభుత్వం అమలుచేయనున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. కూసుమంచిలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయానికి శుక్రవారం వచ్చిన ఆయన అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం కూసుమంచి సెంటర్‌లో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు.

ఈ నెల 28న పీడీఎస్‌యూ విలీన సభ

ఖమ్మంమయూరిసెంటర్: కొంతకాలంగా తెలుగు రాష్ట్రాల్లో విడివిడిగా పనిచేస్తున్న పీడీఎస్‌యూ సంఘాలన్నీ విలీనం కాబోతున్నాయని రెండు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పి.మహేశ్, బోనగిరి మధు తెలిపారు. 28వ తేదీన ఖమ్మం కేంద్రంగా విలీన సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఖమ్మంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం చరిత్రలో ఇది చారిత్రక సందర్భమని తెలిపారు. ఈ ఐక్యత దేశంలోని మరిన్ని విప్లవ విద్యార్థి సంఘాల ఐక్యతకు దారి చూపుతుందని చెప్పారు. ఇందులో భాగంగా 28వ తేదీన ఖమ్మం అంబేడ్కర్ భవనంలో జరిగే విలీన సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పొడపంగి నాగరాజు, హరిణ్య, జి.మస్తాన్, ధనుశ్రీ, సాగర్, సంపత్, పవన్, భాను పాల్గొన్నారు.

రా రమ్మని.. రారా రమ్మని..

ప్రకృతితో పెనవేసుకున్న ప్రదేశాలు, ఎత్తయిన కొండలు, గుట్టలు, పచ్చని చెట్లు, పారేటి సెలయేర్లు, ఆధ్యాత్మికం పరిఢవిల్లే ఆలయాలు, చారిత్రక కట్టడాలు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. పర్యాటకంగా ఎంతో ప్రాధాన్యమున్న ప్రదేశాలున్నాయి. పర్యాటకులకు కనువిందు చేసే అద్భుత స్థలాలున్నాయి. మనసు దోచే ప్రకృతి రమణీయత పరుచుకున్న ప్రాంతాలున్నాయి. నేడు జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా కథనం.. – పాల్వంచరూరల్



ఆకర్షిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు

- అపురూప ఆలయాలు, చారిత్రక కట్టడాలు
- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

ఎత్తయిన కొండలు, గుట్టలు, జలాశయం మధ్య చూడచక్కని హైలాండ్స్, పచ్చని పచ్చిక బయళ్లు, వృక్షాలు కిన్నెరసాని సొంతం. పెద్దమ్మతల్లి గుడి, నవభారత్ వేంకటేశ్వరస్వామి ఆలయం, సీతారామాలయం, పర్ణశాల, వంటి ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. కొత్తగూడెం జిల్లా కేంద్రానికి 24 కిలోమీటర్ల దూరంలో కిన్నెరసాని ఉంది. ఇక్కడ కిన్నెరసాని జలాశయం, అందులో రెండు ద్వీపాలు, బోటుషికారు, చుక్కల దుప్పులు కలిగిన డీర్‌పార్కు, అద్దాల మేడ, కాటేజీలు ఉన్నాయి. ప్రకృతి సోయగాలను ఆస్వాదించేందుకు కిన్నెరసానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వచ్చిపోతుంటారు. వీరి కోసం ప్రత్యేక కుటీరాలను నిర్మించారు. ప్రభుత్వం 2015లో నీతి అయోగ్ పథకం కింద కేంద్రం ద్వారా రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం అభివృద్ధి కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టిన కొత్తగూడెం క్రాస్ రోడ్డు వద్ద హరిత హోటల్ ఫిబ్రవరి 20 నాటికి పూర్తి కానుంది. కిన్నెరసానిలో పది కాటేజీలు, అద్దాల మేడ, ఫుడ్ కోర్టు పనులు నిర్మాణ పూర్తి కాగా వాటిని ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు టూరిజం శాఖ అప్పగించనుంది. వచ్చే నెలలో ఇవి పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయి.

ఇంకా కొన్ని చేస్తే..

వరంగల్ జిల్లా లక్నవరంలో ఏర్పాటు చేసినట్లుగా కిన్నెరసానిలో కూడా జలాశయంలోని నీళ్ల మధ్య ఉన్న రెండు హైలాండ్స్ నడుమ వంతెనను ఏర్పాటు చేసి, ప్రత్యేక హోటళ్లను, వసతి గృహాలను నిర్మించాలి. అప్పుడే కిన్నెరసానికి పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. అయితే, అక్కడకు వెళ్లేందుకు కనీసం బస్ సౌకర్యం కూడా లేకపోవడంతో ఆటోవాలాలు అడిగినంత ఇచ్చి వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయాలపై దృష్టి సారించి అధికారులు మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంది.

ఖమ్మం జిల్లాలో..

చిన్న తిరుపతిగా జమలాపురం..

- ఖమ్మం జిల్లాలోని జమలాపురంలో చిన్న తిరుపతిగా పేరుగాంచిన వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. భక్తుల రద్దీతో నిత్యం కళకళాడుతుంది. అలాగే, కుసుమంచిలో కాకతీయులు నిర్మించిన శివాలయం ఉంది.

బౌద్ధస్తూపం

- నేలకొండపల్లిలో వంద ఎకరాల విస్తీర్ణంలో మట్టితో నిర్మించిన చారిత్రక బౌద్ధస్తూపం, మజ్జిగూడెంలో బౌద్ధులు నాడు నిర్మించిన స్తూపాలు, గృహాలు ఉన్నాయి.

చారిత్రక కట్టడం ఖమ్మం ఖిల్లా...

- ఖమ్మం పట్టణంలో చారిత్రక కట్టడం ఖమ్మం ఖిల్లా, లకారం చెరువు ఉన్నాయి. లకారం చెరువుపై రూ.8 కోట్లతో నిర్మించిన తీగల వంతెన ఆకట్టుకుంటోంది. వైరాలోని జలాశయానికి సైతం పర్యాటకులు వస్తున్నారు.

చదువులో మేటి.. జీవితంలో ఓడి

- జీటెక్ గోల్డ్‌మెడల్ సాధించిన ప్రైజా
- కుమార్తె, మనవరాళ్ల మృతదేహాల వద్ద తల్లిదండ్రుల ఆవేదన



మృతదేహాల వద్ద విలపిస్తున్న మౌనిక(ప్రైజా) కుటుంబ సభ్యులు

మధిర: ఉద్యోగం చేస్తున్నట్లు నమ్మించి ప్రేమ వివాహం చేసుకున్న వ్యక్తి చివరకు చోరీ కేసుల్లో నిందితుడిని తెలియడంతో కుమార్తెలకు ఉరి వేసిన మహిళ సైతం ఆత్మహత్యకు పాల్పడగా... విషయం తెలిసిన ఆమె తల్లిదండ్రులు చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. బీటెక్ పూర్తిచేసిన ఆమెను ఎంటెక్ చదివించి విదేశాలకు పంపించాలని భావిస్తే చివరకు ఇలా జరిగిందని వారు రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఖమ్మం జిల్లా మధిర మండలం నిదానపురానికి చెందిన బాజీ రైలులో వెళ్తే క్రమాన ఉమ్మడి నల్లగొండ జిల్లా సూర్యాపేటకు చెందిన మౌనికను ఉద్యోగం చేస్తున్నట్లు నమ్మించి ప్రేమ పేరుతో మతాంతరం వివాహం చేసుకోవడం.. ఆపై ఆయన చోరీ కేసుల్లో నిందితుడని తెలిసి ఆమె నచ్చచెప్పినా వినకపోవడం.. మరో ఘటనలోనూ పట్టుబడగా పోలీసులు విచారణకు రావడంతో మౌనిక అలియాస్ ఫైజా(ప్రైజా) ఇద్దరు కుమార్తెలకు ఉరి వేసి తాను కూడా గురువారం ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈమేరకు శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలకు నిదానపురం తీసుకురాగా ప్రైజా తల్లిదండ్రులు, సోదరి, బంధువులు చేరుకున్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన వారు మాట్లాడుతూ ప్రైజా బీటెక్‌లో గోల్డ్‌మెడల్‌తో ఉత్తీర్ణత సాధించగా ఎంటెక్ అనంతరం విదేశాలకు పంపించాలనుకున్నామని తెలిపారు. కానీ మాయ మాటలతో బాజీ నమ్మించి ప్రేమ పేరిట వారంలోనే మతాంతర వివాహం చేసుకున్నాడని తెలిపారు. పేదవాడైనా ఆమె ఇష్టాన్ని కాదనలేదని, ఆస్తిపాస్తుల కోసం తమ వద్దకు ఎప్పుడూ రాలేదని గుర్తుచేసుకున్నారు. ఇంతలోనే భర్త చోరీ కేసుల్లో నిందితుడిని తెలిసి నచ్చచెప్పినా తీరు మారకపోవడం, మరోమారు కేసులో ఇరుక్కోవడంతో కష్టసమయాన తమ వద్దకు రాలేక అవమానంతో ఆత్మహత్యకు పాల్పడిందని రోదించారు. కాగా, యువతులెవరూ మాయగాళ్ల వలలో మోసపోవద్దని, కంటికి రెప్పలా పెంచుకున్న తల్లిదండ్రులకు కన్నీరు మిగల్చవద్దని వారు చేతులు జోడించి వేడుకోవడం స్థానికులను కలిచివేసింది. అయితే, ప్రైజా, ఆమె కుమార్తెల అంత్యక్రియలను నిదానపురంలో శుక్రవారం రాత్రి నిర్వహించగా, అప్పటి వరకు ఉండకుండానే ఆమె తల్లిదండ్రులు, బంధువులు వెళ్లిపోవడంతో వారి మనస్సుల్లో ఎంత ఆవేదన గూడుకట్టుకుని ఉందోనని స్థానికులు చర్చించుకున్నారు. అయితే, పోలీసుల అదుపులో ఉన్న బాజీ సైతం అంత్యక్రియలకు హాజరుకాలేదు. ఏదైనా ఘటనలు జరుగుతాయనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

మిర్చి తోటలో వ్యక్తి మృతదేహం

- హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి హత్య చేసిన నిందితులు
- మృతుడు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రమేష్



రమేష్ (ఫైల్)

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లింగారంతండా సమీపాన జాతీయ రహదారి పక్కన ఉన్న మిర్చి తోటలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించగా.. హైదరాబాద్‌కు చెందిన సదరు వ్యక్తిని తీసుకొచ్చి హత్య చేసినట్లు తేలింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.... మిర్చి తోటలో మృతదేహాన్ని శుక్రవారం ఉదయం గుర్తించిన రైతు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై నాగరాజు పరిశీలించారు. మృతుడి రెండు చేతులు ప్లాస్టిక్ తాడుతో కట్టేసి ఉండటం, తలపై గాయాలు కనిపించడమే కాక మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉంది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు రాష్ట్రంలోని అన్ని పోలీసుస్టేషన్లకు సమాచారం ఇచ్చారు. ఈనేపథ్యాన మృతుడు హైదరాబాద్‌కు చెందిన బొల్ల రమేష్(52)గా తేలింది. ఆయన రెండు రాష్ట్రాల్లో వ్యాపారులకు పాన్ మసాలా సరఫరా చేస్తుండగా ఈనెల 18న ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అక్కడి ఖార్ఖానా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేస్తుండగానే ఓ వ్యక్తి రమేష్‌ను హత్య చేసినట్లు చెబుతూ లొంగిపోయాడు. నలుగురు వ్యక్తులు ఆయనను కారులో ఖమ్మం వైపు 18వ తేదీ రాత్రి తీసుకొచ్చి హత్య చేశాక ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారి పక్కన మిరపతోటలో మృతదేహాన్ని పడవేసినట్లు చెప్పాడు. దీంతో అక్కడి పోలీసులు వచ్చి గాలించినా సరైన ప్రాంతం తెలియక వెనుతిరిగారు. ఇంతలోనే కూసుమంచి పోలీసులు ఇచ్చిన సమాచారం ఆధారంగా రమేష్ కుటుంబీకులతో శుక్రవారం రాత్రి వచ్చి మృతదేహం ఆయనదేనని నిర్ధారించుకున్నారు. డబ్బు కోసమే రమేష్‌ను హత్య చేసినట్లు అక్కడి పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోవడంతో ఘటనాస్థలంలోనే పంచనామా నిర్వహించి అన్నం ఫౌండేషన్ సభ్యుల సహకారంతోనే అంత్యక్రియలు నిర్వహించారు.

ముగిసిన ఆర్టిజన్ల దీక్షలు

ఖమ్మంవ్యవసాయం: కన్వర్షన్ చేయాలనే డిమాండ్‌తో విద్యుత్ శాఖలోని ఆర్టిజన్లు ఐదు రోజులుగా చేపడుతున్న రిలే దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఖమ్మం ఎస్ఈ కార్యాలయం వద్ద శిబిరంలో పలువురు మాట్లాడుతూ ఒకే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు రకాల సర్వీసు రూల్స్‌ను అమలు చేయడం సరికాదన్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే వచ్చేనెల 20న చలో హైదరాబాద్ నిర్వహిస్తామని తెలిపారు. దీక్షలో నాయకులు ఎం.ప్రసాద్, అంజనేయులు, చాంద్, రామానుజం, అన్వర్, వై.విక్రం, రామకృష్ణ, నాగార్జున, బి.పుష్పరాణి, కె.నాగేశ్వరరావు, ముకుందరెడ్డి, జి.రమేష్, క్రాంతి, పురుషోత్తం, ఎం.శ్రీనివాస్, మూర్తి, అనంతప్రకాష్, శ్రీనివాసరావు, ఉపేందర్, కృష్ణారావు, అన్వర్, సైదులు, శ్రీకాంత్, సురేష్, బషీరుద్దీన్, హరిత, సంధ్య, కళ్యాణి, రజిని, సత్యవతి, జ్యోతి, కిరణ్, నాగరాజు, రవీందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌ను దూషించిన వ్యక్తిపై కేసు

కారేపల్లి: విధుల్లో ఉన్న అంగన్‌వాడీ టీచర్‌ను అకారణంగా కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. కారేపల్లి క్రాస్ రోడ్డు గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న భూక్యా పుష్పలత ఈనెల 23న కేంద్రంలో విధులు నిర్వర్తిస్తుండగా అదే గ్రామానికి చెందిన ఆవుల వెంకట్రావ్ వచ్చి కులం పేరుతో దూషించి దాడి చేశాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.రాజారాం తెలిపారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



సొసైటీ వద్ద వేచిఉన్న రైతులు

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు శుక్రవారం పడిగాపులు కాసారు. సరిపడా యూరియా లేకపోవటంతో పలువురు నిరాశగా వెనుదిరిగారు. చెన్నూరు సొసైటీకి ఇటీవల సన్న యూరియా వచ్చినా మొత్తం గడ్డలు కట్టి ఉండడంతో రైతులు తీసుకోలేదు. చంద్రుపట్ల సొసైటీకి సమయానికి యూరియా రాలేదని రైతులు మాదాల వెంకటేశ్వరరావు, మట్టూరి స్టాలిన్, జలా అప్పారావు తదితరులు ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించి చెన్నూరు సొసైటీ పరిధిలో రైతులకు సరిపడా లావు యూ రియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

భారీ జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ



100 అడుగులు జాతీయ జెండాతో ప్రదర్శనలో విద్యార్థులు

కొణిజర్ల: జాతీయ బాలికల దినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలబాలికలు శుక్రవారం 100 అడుగుల భారీ జాతీయ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. జాతీయ నాయకుల వేషధారణతో పలువురు విద్యార్థులు ముందు నడుస్తుండగా పాఠశాల నుంచి తనికెళ్ల సెంటర్ వరకు ప్రదర్శన కొనసాగింది. ఈసందర్భంగా ఆడపిల్లలను చదవనిద్దాం.. ఆడపిల్లలకు బతుకునిద్దాం అంటూ నినాదాలు చేశారు. జెడ్పీహెచ్ఎస్, పీఎస్‌హెచ్ఎంలు శ్రీనివాస్, రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు సురేష్ ముల్క, ప్రబాకర్, లక్ష్మీనారాయణ, రాజారత్నం, పురుషోత్తం, లక్ష్మీప్రియ, సునీత, చంద్రశేఖర్, శివరాణి, జాకీరా బేగం, రోజీ మేరీ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ఖమ్మం క్రైం: ఖమ్మం మామిళ్లగూడెంకు చెందిన వనం నర్సింగరావు ఇంట్లో ఈనెల 6వ తేదీన దొంగతనం చేసిన నిందితుడిని ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బి.బాలకృష్ణ కథనం ప్రకారం.. నర్సింగరావు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లగా రాత్రి సమయాన చొరబడిన గూడే హరీశ్‌రావు 75 గ్రాముల బంగారం ఆభరణాలు దొంగిలించాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తుండగా శుక్రవారం మయూరి సెంటర్ బ్రిడ్జి వద్ద తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన హరీశ్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఈమేరకు విజయవాడలోని రాజాగిరి వీధికి చెందిన మెడికల్ షాపు డెలీవర్ బాయ్ అయిన హరీశ్ చోరీ చేసినట్లు ఒప్పుకోవడంతో ఆయన నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ గౌతమి, ఏఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కారు

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెన సమీపాన సిమెంట్ ట్యాంకర్‌ను కారు ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైరా మండలం విప్పలమడకకు చెందిన చెరుకూరి క్రాంతి తన కారులో స్వగ్రామం నుండి వైరా వైపు వెళ్తుండగా హైదరాబాద్ నుండి పాల్వంచకు వెళ్తున్న ఖాళీ సిమెంట్ ట్యాంకర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు అదుపు తప్పి పల్టీ కొట్టగా క్రాంతికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే, ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణపాయం తప్పినట్లయింది. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో వాహనాలు నిలిచిపోగా పోలీసులు చేరుకుని క్రేన్ సాయంతో ట్యాంకర్‌ను తీయించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

సత్తా చాటిన జిల్లా బాలికలు



ఖమ్మం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీవైఎస్ఓ సునీల్‌కుమార్‌రెడ్డి

- ముగిసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ
- రెండు, మూడు స్థానాల్లో రంగారెడ్డి, పాలమూరు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర పాఠశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర అండర్–17 బాలికల క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ టోర్నీలో ఖమ్మం జట్టు ట్రోఫీ కైవసం చేసుకోగా, రెండు, మూడు స్థానాల్లో రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జట్లు నిలిచాయి. ఫైనల్స్‌లో ఖమ్మం–రంగారెడ్డి జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 90పరుగులు చేసింది. ఈ జట్టులో అనన్య 9ఫోర్లతో 42 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రంగారెడ్డి జట్టు 74 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో ఖమ్మం జట్టు టైటిల్ దక్కించుకుంది. ఇక మహబూబ్‌నగర్–మెదక్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడంతో తృతీయస్థానంలో నిలిచింది. డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి క్రీడాకారులకు ట్రోఫీలు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడల కార్యదర్శి కె.నర్సింహామూర్తి, పీడీలు కె.ఆదర్శ్‌కుమార్, నరేష్, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎంపీ వద్దిరాజు



ఎంపీకి శుభాకాంక్షలు చెబుతున్న కేసీఆర్

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం ఎర్రవల్లిలో కలిశారు. ఈసందర్భంగా ఎంపీకి కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. అలాగే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సైతం కలిశారు. కాగా, ఉదయం ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం, ఎంపీ క్యాంపు కార్యాయలంలోనూ ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు ఆధ్వర్యాన రవిచంద్ర కేక్ కట్ చేయగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకవీరయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో పాటు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, తోట రామారావు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, దండా జ్యోతిరెడ్డి, బెల్లం వేణు, దిండిగల రాజేందర్, అఫ్జల్ హసన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



కార్యాలయాన్ని ప్రారంభించాక నాయకులతో హర్షవర్ధన్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పాటుపడతానని పీఆఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన సంఘం కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ఎమ్మెల్సీల నిర్వాకంతోనే 317జీఓ వచ్చిందని, వేతనాల చెల్లింపుల్లో ఆలస్యం జరిగిందన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చొరవకు తోడు తమ కృషితో స్పౌజ్ బదిలీలు ప్రారంభమయ్యాయని తెలిపారు. మిగతా సమస్యలు కూడా పరిష్కారం కావాలంటే ఉపాధ్యాయులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మినేని అనిల్, ముత్తినేని సురేష్‌తో పాటు బాలాజీ, శ్రావణ్, స్వామి, పోట్ల నాగేశ్వరరావు, దుబాకుల శ్రీనివాసరావు, హరిప్రసాద్, ఓ.సోందు, వీరేంద్ర, విష్ణు, ఇందిర, పాపాలాల్, కిషోర్, చంద్రశేఖర్, జావేద్, సేట్రాంనాయక్, కృష్ణరాథోడ్ పాల్గొన్నారు.

ఏ ప్రాతిపదికన పథకాలు అమలుచేస్తారు?

ఎమ్మెల్సీ తాత మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్, పక్కన సండ్ర, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ఈనెల 26నుంచి నాలుగు పథకాలను అమలుచేస్తామని చెబుతున్న రాష్ట్రప్రభుత్వం ఏ ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేస్తుందో చెప్పాలని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామసభల్లో ప్రదర్శించిన జాబితాల్లో అర్హులకు చోటు దక్కలేదని పేర్కొన్నారు. దీంతో ప్రజలు ఆందోళనకు దిగగా మళ్లీ దరఖాస్తులు స్వీకరించారని.. ఇలాంటప్పుడు 26వ తేదీ నుంచి ఏ ప్రతిపాదికన పథకాలు అమలుచేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దరఖాస్తులు తీసుకుంటూనే ఉండగా, ఇప్పుడు వచ్చిన లక్షల దరఖాస్తులను రెండు రోజుల్లో ఎలా పరిశీలిస్తారో చెప్పాలన్నారు. కాగా, ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లు దక్కవంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజీనామా చేసి మళ్లీ పోటీకి రావాలని వారు సూచించారు. ఈ సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, దండా జ్యోతిరెడ్డి, నాయకులు బెల్లం వేణు, పగడాల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.